"నీకున్న ఆస్తి అంతా పోగొట్టుకున్నావనుకో. అప్పుడు నీకేం అవుతుంది?" ప్రశ్నించాడాయన.

"బాధ కలుగుతుంది."

"సరే. అదంతా తిరిగి నీకు లభ్యమయిందనుకో. అప్పుడు?"

"చాలా సంతోషం కలుగుతుంది."

"అంటే నీ దగ్గరున్న దానివల్లే నీకు సంతోషం కలుగుతోంది కదా. కాబట్టి నీ దగ్గర వున్నదే నీకుండాలని కోరుకో. నీ దగ్గర లేనిది నీకు దక్కాలని ఆశించడం మాను. అప్పుడు నీకు దుఃఖం ఎలా కలుగుతుందో నేను చూస్తాను."

## 119. స్వర్గమా? నరకమా?

ఓ మహాత్ముడు స్వర్గం, నరకంల ఉండే మనుషుల స్వభావాలు ఎలా వుంటాయో దివ్య దృష్టితో చూసి తెలుసుకున్నాడు.

నరకంలో ఓ పెద్ద పాయసం గిన్నె చుట్టూ కూర్చున్న బలహీనంగా ఉన్న మనుషుల చేతుల్లో పొడుగాటి కాడలు గల చెంచాలున్నాయి. వాటి కాడలు పొడుగ్గా వుండటంతో వారెవరూ ఆ చెంచాలని పాయసం గిన్నెలో ముంచి తమ నోట్లో పెట్టుకుని పాయసాన్ని తాగలేక పోతున్నారు.

స్వర్గంలో పాయసం గిన్నె చుట్టూ కూర్చున్న వారంతా ఆరోగ్యంగా ఉన్నారు. వారి చేతుల్లో కూడా పొడుగాటి కాడలున్న చెంచాలు ఉన్నాయి. ఒకరికొకరు ఆ పొడుగు కాడల చెంచాలతో తినిపించుకుంటున్నారు.

నరకంలోని వారెవరికీ తీసుకోవడం తప్ప ఇవ్వడం తెలీదు. ఎందుకంటే, వారిలో దయ లేదు. స్వర్గంలోని వారందరికీ దయ వుంది. కాబట్టి తీసుకోవడం కాక ఇవ్వడం తెలుసు. మనం స్వర్గానికి వెళ్ళాలో లేదా నరకానికో బ్రతికుండగానే నిర్ణయించుకుని, దయని అలవాటు చేసుకోవాలి.